క్లుప్తంగా

జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: బొట్టా శంకర్ మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి జూనియర్స్ బాక్సింగ్ పోటీలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరైనట్టు బాక్సింగ్ క్లబ్ ప్రతినిధి కోటి యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, పల్లా రమణ, నక్క మధుబాబు, ప్రసాద్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమల బాలాజీ ప్రతిష్ఠా మహోత్సవాలు



బాలాజీ మందిరంలో పూజల్లో పాల్గొన్న మాలధారులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ సినీ వరల్డ్ వద్ద నిర్మిస్తున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న స్వామి విగ్రహానికి ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు పూజలు చేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధన పూజ, పంచగవ్య ఆరాధన, అకల్మష హోమం జరిపించారు. బాలాజీ మాలధారణ చేపట్టిన ఎస్టీబీఎల్ ఉద్యోగుల దంపతులతో పాటు ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రా లు అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మె

గాజువాక: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు సోమవారం టోకెన్ సమ్మె నిర్వహించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, మృతి చెందిన కార్మికుల ఖాళీలను వారి వారసులతో భర్తీ చేయాలన్న డిమాండ్లపై ఆందోళన చేపట్టారు. సమ్మె సందర్భంగా విధులను బహిష్కరించిన కార్మికులు సామూహిక రాయబారం పేరిట నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్మికుల సమ్మెతో క్లాప్ వాహనాలు వార్డులలో తిరగలేదు. సమ్మె సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జోన్-6 ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావును పోలీసులు హౌస్ అరెస్టు చేయగా, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిచి అరెస్టు చేసినట్టు ఆ యూనియన్ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో వచ్చేనెల 19 నుంచి సమ్మెకు దిగుతామని నాయకులు పేర్కొన్నారు.

మురుగు కూపాలుగా ఖాళీ స్థలాలు

- రానున్న వర్షాకాలం మరింత ప్రమాదం
- పట్టించుకోని స్థల యజమానులు
- స్థానికుల ఇక్కట్లు



శ్రీనివాస రెసిడెన్సీ పక్కన మురుగు, చెత్త, వర్షపు నీటితో నిండిన ఖాళీ స్థలం



అశోక్‌నగర్ ప్రాంతంలో మురుగునీటితో నిండిన ఖాళీ స్థలం

కూర్మన్నపాలెం: భవిష్యత్తు అవసరాల కోసం కొనుగోలు చేసిన ఖాళీ స్థలాలు ప్రస్తుతం మురుగు కూపాలుగా మారుతున్నాయి. దోమలకు ఆవాసంగా మారి ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. దీంతో స్థానికంగా నివసిస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. నగరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇటువంటి ఖాళీ స్థలాలపై చర్యలు చేపట్టాల్సి ఉన్నా నగర పాలక సంస్థ యంత్రాంగం ఆ దిశగా స్పందించిన దాఖలాలు లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రానున్నది వర్షాకాలం కావడంతో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నగర శివార్లలో చాలా మంది ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకుని వదిలేశారు. డ్రైనేజీల్లేక, ఇళ్ల మధ్య ఉన్న ఈ ఖాళీస్థలాల నుంచి నీరు ఎటూ వెళ్లక మురుగుగా రూపాంతరం చెందుతోంది. ఇలాంటి ఖాళీ స్థలాలపై జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఆయా ఖాళీ స్థలాలు చెత్తకు, నీటి నిల్వకు కేంద్రాలుగా మారుతున్నాయి. వాస్తవానికి ఆయా స్థల యజమానులు ఖాళీ స్థలం పన్నును చెల్లించాల్సి ఉంది. డాక్యుమెంట్ విలువలో 5 శాతం పన్ను కట్టాలి. కానీ అలా జరగడం లేదు. పన్ను వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఖాళీ స్థలాలపై అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 86వ వార్డు అశోక్‌నగర్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలున్నాయి. యజమానులు స్థలాలను కొని వదిలేయడంతో, ఆ ప్రాంతాల్లో నీరు నిలిచి మురుగు కూపాలుగా మారాయి. ఇటీవల కురిసిన చిన్న వర్షాలకు కూడా ఈ ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి, చెత్తాచెదారం కుళ్లి అపరిశుభ్రంగా తయారైంది. ఇక రానున్న వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు నిలిచి దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. విషజ్వరాలు వ్యాపించే ముప్పు ఉన్నందున, జీవీఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మురుగు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేయాలి

ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలి. పట్టించుకోని పక్షంలో నిబంధనల మేరకు వారిపై చర్యలు చేపట్టాలి. మురుగు, పిచ్చి మొక్కలు పెరగకుండా ఆయా స్థలాల యజమానులే చర్యలు తీసుకునేలా చూడాలి.

–మురళీమోహన్, శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్, అశోక్‌నగర్

పర్యవేక్షణ లేకపోవడం వల్లే..

ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో మురుగు నిల్వ ఉండకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. దీనిపై అధికారులు కూడా స్పందించక పోవడంతో స్థల యజమానలు ఆ ఊసే ఎత్తడం లేదు. నోటీసులు ఇచ్చినప్పుడు అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నా యి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత జటిలమవుతుంది.

– శ్రీనివాసరావు, అశోక్‌నగర్

చర్యలు తీసుకుంటాం

శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలో కొన్ని లోపాలున్నాయి. వాటిని సరి చేసేలా చూస్తాం. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

–కిరణ్‌కుమార్, జోన్–6 ఏఎంహెచ్‌వో

కనులపండువగా అమ్మవార్ల తిరువీధి ఉత్సవం



రామాలయం నుంచి అమ్మవారి చిత్రపటాలు, ప్రభలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు



ప్రవచిస్తున్న బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల ప్రారంభ వేడుకలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29న ప్రారంభమైన ఉత్సవాలు 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామకమిటీ ఆధ్వర్యంలో సోమవారం తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల చిత్రపటాలు, ప్రభలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, పూజలు చేశారు. ఆలయాల వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. పరిసరాల్లో మహిళల కోలాటం, కళాకారుల సాము గరిడీ ఆకట్టుకున్నాయి.

దేవీ వైభవంపై ప్రవచనాలు

అమ్మవార్ల నూతన ఆలయం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ శృంగేరి శారద పీఠం ఆస్థాన పౌరాణికులు, ప్రవచన నిధి శ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి విచ్చేశారు. దేవీ వైభవంపై ఆయన ప్రవచనాలు ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

వేసవి శిబిరంలో పుస్తక ప్రదర్శన



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వందల సంఖ్యలో పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు వాటిని ఆసక్తిగా తిలకించారు. వాటిలోనుంచి కొన్ని పుస్తకాలను విద్యార్థులతో చదివించడంతో పాటు ఆ పుస్తకాల ద్వారా ఎటువంటి విషయాలను నేర్చుకున్నామన్న అంశాలను వారితో రాయించారు. అనంతరం విద్యార్థులకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కథలు చెప్పించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు ఎల్.వెంకటలక్ష్మి, ఎం.లీలాదుర్గ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో న్యాయవాదికి స్వర్ణ పతకం



పతకాన్ని అందుకున్న లక్ష్మితో నిర్వాహకులు



రజత పతకం సాధించిన మొహమ్మద్ షాబుద్దీన్

గాజువాక: సమైక్య భారతి ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో గాజువాకకు చెందిన న్యాయవాది, ఏపీ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి స్వర్ణ పతకం సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి పలు క్రీడల్లో 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. యోగా విభాగంలో పాల్గొన్న లక్ష్మి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీకేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పంకజ్ గౌల్, శివ తివారీ చేతులమీదుగా ఆమె ఈ పతకాన్ని అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అండిబోయిన అప్పారావు, ఎం.భాస్కరరావు, వి.అప్పారావు తదితరులు ఆమెను అభినందించారు.

వంద మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం

పెదగంట్యాడ: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ స్టేడియంలో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 8వ నేషనల్ గేమ్స్‌లో నగరానికి చెందిన మొహమ్మద్ షాబుద్దీన్ అథ్లెటిక్స్‌లో పతకం సాధించారు. 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించి, దుబాయ్‌లో ఆగస్టులో జరగనున్న ఎస్‌బీకేఎఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సంపాదించారు.

ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారంపై పోటీలు



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ సంస్థలు సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీలు నిర్వహించాయి. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై జరిగిన చిత్రలేఖనం,వక్తృత్వం, క్విజ్ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఏయూ పర్యావరణ విభాగం ఆచార్యుడు ఇ.యు.బి.రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి ఎంతో చేటుగా మారిందని వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ బాబూరావు, సెయింట్ జోసెఫ్ కళాశాల లెక్చరర్ మేరీ అనుపమ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ వలంటీర్లు వి.కిరణ్మయి, ఎం జలీన్ భాస్కర్, జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు పాల్గొన్నారు.

అత్తింటి ఎదుట కోడలు నిరసన

కూర్మన్నపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వివాదానికి దారితీశాయి. ఏడాది క్రితం ప్రసవానికి పుట్టింటి నుంచి వెళ్లిన భార్యను తిరిగి రానివ్వకపోవడంతో భర్త ఇంటి ముందే నిరసనకు దిగింది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం వుడా ఫేస్-7కు చెందిన వూడి వరకుమార్, మల్కాపురం ప్రాంతానికి చెందిన ఆడారి శ్రీపల్లవి ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తుండగా ప్రేమించుకున్నారు. క్రిస్టియన్ సంప్రదాయబద్ధంగా 2018లో వివాహం చేసుకున్నారు. ఇరువురి మతాలు వేరు కావడంతో వివాహం తర్వాత వివాదాలు పెరిగాయి. ఫోన్‌లో ఇతరులతో పాటు తల్లిదండ్రులతో కూడా మాట్లాడవద్దని, ఉద్యోగం మానేయాలని, దుస్తులపై కూడా భర్త ఆంక్షలు పెట్టడంతో వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలో పుట్టింటికి ప్రసవానికి వెళ్లిన శ్రీపల్లవి 2022లో బాబుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కన్నవారి ఇంటిలోనే ఉంటోంది. బాబు పుట్టిన మూడు నెలలకు భర్త రమ్మంటే ఐదో నెలలో వస్తానని చెప్పుకొచ్చారు. పుట్టిన బాబుకు హిందూ సంప్రదాయం ప్రకారం అన్నప్రాసన, ఉయ్యాలలో వేయడం వంటి శుభ కార్యాలు చేసినా భర్త వరప్రసాద్‌కు సమాచారం ఇవ్వలేదు. దీంతో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు మరింత పెరిగాయి. ఎట్టకేలకు సోమవారం బాబును తీసుకుని శ్రీపల్లవి అత్తవారింటికి వచ్చింది. దీంతో వరకుమార్ భార్య శ్రీపల్లవిని ఇంట్లోకి రావద్దని అడ్డుకున్నాడు. కుమారుని శుభకార్యాలకు తనకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శ్రీపల్లవి మహిళా సంఘాలను ఆశ్రయించింది. మహిళా సంఘాలు వరకుమార్ ఇంటికి చేరుకోవడంతో తన పరువు తీస్తావా అంటూ భార్య శ్రీపల్లవిపై మండిపడ్డాడు. దీంతో మహిళా సంఘాల పోలీసులకు సమాచారాన్ని చేరవేయడంతో సీఐ శ్రీనివాసరావు ఇరువర్గాలను పిలిపించి నచ్చచెప్పారు. చివరకు పెద్దల సమక్షంలో చర్చించుకుంటామని వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

జెడ్సీ దృష్టికి గాంధీనగర్ సమస్యలు

గాజువాక: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో జెడ్సీని సోమవారం కలిసి, వినతి పత్రం సమర్పించారు. కాలనీలో రోడ్లు, డ్రైన్లు పాడైపోయాయని పేర్కొన్నారు. దీనివల్ల మురుగునీరు రోడ్లపైకి వచ్చేస్తోందని తెలిపారు. శివాలయం పార్కులో మోటారు పాడైపోయి మొక్కలు ఎండిపోతున్నాయన్నారు. మోటారుకు మరమ్మతులు చేయడంతోపాటు పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాలనీ అసోసియేషన్ నాయకులు తెంటు సత్యనారాయణ, గొర్లె రామునాయుడు, పీవీటి రమణారావు, బాసంగి తిరుపతిరావు, పాపినాయుడు తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గాజువాక : జీవీఎంసీ 67వ వార్డు శంకర్‌నగర్‌లోని గాజువాక సర్వే నంబర్ 18లో గల ప్రభుత్వ భూమిలో 700 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని ప్రజా హక్కుల కమిటీ మహిళా నాయకులు జొన్నల అనుపమ యాదవ్, అమజాల చంద్ర శ్రీలక్ష్మి జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గాజువాకలోని వేరే ప్రాంతానికి చెందిన డాక్యుమెంట్‌తో శంకర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు. రూ.4 కోట్ల విలువైన ఈ భూమిని ఆక్రమించడంలో ఒక ప్రభుత్వ సర్వేయర్ కీలకంగా వ్యవహరిస్తున్నారని, తనకున్న పలుకుబడితో మండల రెవెన్యూ అధికారుల నుంచి అభ్యంతరం లేకుండా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ స్థలంలో ప్రభు త్వ ఆస్పత్రి నిర్మించాలని కోరామని, అప్పటి అధికారులు అంగీకరించారని తెలిపారు. ఆ సమయంలో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టడానికి ఆ సర్వేయర్ బంధువులు ప్రయత్నించగా, అప్పటి అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించారని తెలిపారు. దీంతో అప్పుడు ఆ నిర్మాణం ఆగిపోయిందని, అప్పటి అధికారులందరూ బదిలీ అయిపోవడంతో ఇప్పుడు అందులో నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాపాడి దాన్ని ప్రజోపయోగానికి వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ నిర్మాణాన్ని ఆపాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్టు జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై అప్రమత్తత అవసరం

గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: ప్రజల నుంచి అందుతున్న వివిధ ఫిర్యాదుల పరిష్కారంపై జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సోమవారం సమీక్ష నిర్వహించారు. జోన్‌లోని విభాగాధిపతులతో సమావేశమైన జెడ్సీ వివిధ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులను వెల్లడించారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారానికి చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ఒక్క ఫిర్యాదు కూడా పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు. వాటి పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై కమిషనర్ ఎప్పటికప్పుడు వివరాలను అడుగుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రతి విభాగానికి చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, డీఈలు ప్రసాద్‌బాబు, అప్పారావు, వాటర్ సప్లై సహాయ ఇంజినీరు కేదార్‌నాథ్, సూపరింటెండెంట్ కె.రమణ, టౌన్‌ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమాలు



దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమని స్పష్టం చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 837వ రోజు సోమవారం ఎంఎంఎస్ఎం మరియు ఎస్‌టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోబోమన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు సత్కారం



సీజీఎం శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కల్లూరి శ్రీనివాసరావును ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున శ్రీనివాసరావు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో సోమవారం ఆయనను కలిసి, సత్కరించారు. స్టీల్‌ప్లాంట్‌లో కనిష్ఠ స్థాయిలో చేరి, అంచెలంచెలుగా చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగిన తీరును ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తనకు విధి నిర్వహణలో సహకరించిన సహోద్యోగులు, కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న, మోహన్‌బాబు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పాఠశాలల విలీనానికి వినతి



ఇన్‌చార్జి డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడి రెవెన్యూ పరిధి, పరవాడ మండల విద్యాశాఖ పరిధిలోని పినమడక, లేమర్తి జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మరో 6 ఎంపీపీ పాఠశాలలను గాజువాక మండలంలో విలీనం చేయాలని అగనంపూడి అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విన్నవించడంతో ఆయన పాఠశాలల విలీనంపై ఇన్‌చార్జి డీఈవోకు లేఖను రాశారు. ఈ లేఖను అగనంపూడి అఖిలపక్ష కమిటీ డీఈవోకు అందజేశారు. దీంతో పాటు అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్‌సీసీని కొనసాగించేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నగర ఉపాధ్యక్షుడు సాలాపు అచ్చిబాబు, జిల్లా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కడిమి హనుమంతరావు, జిల్లా ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోమాడ రాము తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన లక్ష్యం



సదస్సులో పాల్గొనేందుకు వివరాలు నమోదు చేసుకుంటున్న యువతీయువకులు

పెదగంట్యాడ: జిల్లాలో దివ్యాంగులకు, యువతకు రిటైల్ సెక్టార్‌పై శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపించడమే లక్ష్యమని ట్రైన్ ఆర్గనైజేషన్ సౌత్ ఇండియా మేనేజర్ సురేష్ అన్నారు. పెదగంట్యాడ మండలం గొట్టివానిపాలెం ఎంపీపీ స్కూల్ ప్రాంగణంలో కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి కల్పన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జూన్ మొదటి వారం నుంచి పెదగంట్యాడ, సింహాచలం, నర్సీపట్నం ప్రాంతాల్లో ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో హజారే గ్రూప్ చైర్మన్ ప్రవీణ్, అమరేంద్ర, 200 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం సందర్శన



విద్యార్థులు, కోచ్‌లతో జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సోమవారం సందర్శించారు. పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్ నుంచి శిబిరం వివరాలు సేకరించారు. ఈ నెల 22న ప్రారంభమైన శిబిరంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్ శిక్షణకు సుమారు 60మంది విద్యార్థులు హాజరవుతున్నారని పీడీ తెలిపారు. విద్యార్థులకు రోజూ గుడ్డు, మిల్క్ షేక్, బిస్కెట్ ప్యాకెట్లను సచివాలయ ఉద్యోగులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రౌండ్‌లో ఆవుల సమస్యను జెడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల మైదానంలో కొందరు ఆవులను వదిలేయడంతో, తెల్లవారేసరికి వాటి మలమూత్రాలతో మైదానం నిండిపోతోందని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై జెడ్సీ స్పందిస్తూ త్వరలో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని పీడీ తెలియజేశారు.

నేడు స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.